క్లుప్తంగా

బాల్య వివాహాలను అరికడదాం



బాల్య వివాహాలు, బాల కార్మికుల నిర్మూలనపై ర్యాలీ చేస్తున్న మహిళలు

పాలసముద్రం: మండలంలో బాల్య వివాహాలు జరగకుండా ప్రతిఒక్కరూ కృషి చేయాలని మండల చైల్డ్‌లైన్ ఆఫీసర్ రాజ్‌కుమార్ తెలిపారు. సోమవారం పాలసముద్రంలో శ్రీబొమ్మరాజుపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వెంకటేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ చెంచయ్య గ్రామాఖ్య సంఘ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, బాల కార్మికుల నిర్మూలనపై మహిళలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. హెచ్‌ఎం వెంకటేష్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల వచ్చే అనర్థాల గురించి వివరించారు. బాల కార్మికులను నిర్మూలనపై అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం జెండర్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

అభ్యసనా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు అభ్యసనా సామగ్రి పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సుకుమార్, నేతలు

వెదురుకుప్పం: మండలంలోని మాంబేడు పంచాయతీ ధర్మాచెరువు గ్రామంలో సోమవారం జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ పుట్టిన రోజు సందర్భంగా సర్పంచ్ కవిత ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అభ్యసనా సామగ్రిని వితరణ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. అదేవిధంగా వెదురుకుప్పంలో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు రామయ్య, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ, మాంబేడు ఎంపీటీసీ సభ్యుడు గుణశేఖర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

మునిరత్నం సేవలు మరువలేనివి



వృద్ధులకు అన్నదానం చేస్తున్న ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ కిరణ్‌కుమార్

కార్వేటినగరం: రాస్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ మునిరత్నం సేవలు ఎనలేనివని స్టేట్ బ్యాంకు మేనేజర్ కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం రాస్ అధినేత డాక్టర్ మునిరత్నం వర్ధంతిని పురస్కరించుకుని కార్వేటినగరం వృద్ధాశ్రమంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పద్మశ్రీ అవార్డు గ్రహీత మునిరత్నం రాస్ అభ్యునతికి ఎంతో కృషి చేశారని, ప్రస్తుతం రాస్ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఎంతోమంది ఉపాధి పొందుతున్నారని గుర్తు చేశారు. అనంతరం మునిరత్నం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ ప్రకాష్, వృద్ధులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ విజయకుమార్

కార్వేటినగరం: ఉపాధ్యాయులు విధిగా సమయపాలన పాటించాలని ఎంఈఓ ఎం.విజయకుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీలో పీఆర్టీయూ క్యాలెండర్‌ను సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఉత్తమ బోధన ద్వారా విద్యార్థుల సర్వోతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అనంతరం పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి జోగి గురుమూర్తి మాట్లాడుతూ పీఆర్‌టీయూ సంఘం ఉపాధ్యాయుల హక్కులు, బాధ్యతలను రెండు కళ్లుగా భావించి సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షురాలు మునిలక్ష్మి, ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, జిల్లా నాయకులు దామోదరం, కల్యాణ్‌కుమార్ పలువురు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

నింద్ర: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీఓ శివప్రసాద్ వర్మ అన్నారు. సోమవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో మురుగు కాలువలు శుభ్రం చేయడం, రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు తొలగించాలని, తాగునీరు లీకేజీ లేకుండా చూడాలని ఆదేశించారు. ఇళ్ల పరిసరాలు కూడా శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. రోగాలు రాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానించాలన్న డిమాండ్ చాలా కాలంగా ఉంది. ప్రభుత్వాలు ప్రకటనలు చేస్తున్నాయే తప్ప అమలు చేయడం లేదు. కూలీలు ఎక్కువగా ఉపాధి హామీ పనులకు వెళ్తుండడంతో వ్యవసాయ పనులకు కొరత ఏర్పడుతోంది. దీంతో కూలి రేటు పెరగడంతోపాటు, వ్యవసాయ పనులు సకాలంలో పూర్తికాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. యంత్ర పరికరాలు ఎన్ని అందుబాటులోకి వచ్చినా చాలా పనులు కూలీల ద్వారానే చేయించాల్సి ఉంటుంది. దీంతో కూలీల కొరత ఏర్పడి రైతులు అగచాట్లు పడుతున్నారు. రైతన్నలు ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే రైతులకు ఊరట కలుగుతుంది. రైతులపై ఖర్చు భారం కూడా కాస్త తగ్గుతుంది. – పాలసముద్రం

ఉపాధి వ్యవసాయం
కలేనా..

- నెరవేరని వ్యవసాయానికి ఉపాధి అనుసంధానం
- 2014లోనే అనుసంధానం చేస్తామన్న టీడీపీ
- పెరిగిన ఖర్చులు.. కూలీలు దొరక్క అవస్థలు

2014 సంవత్సరంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేస్తామని హామీ ఇచ్చి విస్మరించింది. ప్రస్తుతం బీజేపీ, జనసేనతో కలసి అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎందుకో ఆ హామీ అమలు చేసే దిశగా మాత్రం ముందు



వరి నాట్లు వేస్తున్న కూలీలు



ఉపాధిహామీ పథకంలో పనులు

కెళ్లడం లేదు. కేంద్రంలో కూటమి ప్రభుత్వం ఎంపీలు మాత్రం అవసరం, గతంలో ఇచ్చిన ఉపాధిహామీ పథకాన్ని వ్యవవసాయానికి అనుసంధానించే హామీ ఊసే లేదు.

కూలీల కొరతకు చెక్

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఖరీఫ్, రబీలో వేరుశనగ, వరి, రాగి, చెరకు వంటి పలు పంటలు సాగు చేస్తున్నారు. రైతులు వారి స్థోమతకు మించి బీడు భూములు ఉండకూడదని వ్యవసాయం చేస్తున్నారు. అందులో వచ్చిన ఆదాయంతో జీవనం సాగిద్దామనే ఆశతో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి వ్యవసాయంలో పెట్టుబడులు పెడుతున్నారు. దీంతో తరచూ నష్టాలే మిగులుతున్నాయి. వరి, వేరుశనగ సాగు చేస్తున్న రైతులు విత్తనాలు చల్లడం, మొదటి కోత, కుప్పలు, నూర్పిడి ఇతరత్రా పనులకు ఎకరా సాగుకు దాదాపు రూ.25 వేల నుంచి 35 వేల దాకా ఖర్చులు భరించాల్సి ఉంది. వ్యవసాయ రంగాన్ని ఉపాధికి అనుసంధానం చేస్తే కూలీల కొరతతోపాటు రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. ఇప్పటికైనా టీడీపీ కూటమి ప్రభుత్వం కేంద్రాన్ని ఒత్తిడి చేసి ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని రైతాంగం కోరుతోంది.

మండలం పేరు	ఉపాధి కూలీలు	జాబ్ కార్డులు
గంగాధరనెల్లూరు	12151	7510
శ్రీరంగరాజుపురం	11584	6246
కార్వేటినగరం	7049	7049
వెదురుకుప్పం	12825	7548
పెనుమూరు	9242	5797
పాలసముద్రం	4950	3830

ఉపాధికి అనుసంధానం అవసరం



ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలి. ప్రస్తుత పరిస్థితిలో పంట సాగు రైతులకు భారంగా మారింది. ప్రతి పంటకు రైతులు అప్పులు చేసి సాగు చేస్తున్నప్పటికీ లాభాలు మాత్రం రావడం లేదు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి. లేకుంటే రైతులు వీధుల పాలైపోతారు.

– మనోహర్, వీర్లగుడి, రైతు

అప్పుల పాలవుతున్నాం.. ఆదుకోండి



రైతులకు పంటల సాగు భారంగా మారింది. వ్యవసాయంపై పెట్టిన పెట్టుబడులు కూడా దక్కడం లేదు. పెట్టిన ఖర్చు రాక పోగా అప్పుల పాలవుతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వాలు రైతుల కష్టాలను గుర్తించి ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి. అప్పుడు కొంత ఖర్చు తగ్గుతుంది.

– రవిరెడ్డి, కేజే పురం, రైతు

రైతుల కష్టాలను గుర్తించాలి



ప్రభుత్వం రైతుల కష్టాలను గుర్తించి ఉపాధి హామీ పథకాన్ని ఇప్పటికైనా వ్యవసాయానికి అనుసంధానం చేయాలి. దానివల్ల రైతులతోపాటు కూలీలకు కూడా మేలు జరుగుతుంది. ప్రస్తుతం వ్యవసాయంలో కనీసం పెట్టుబడులు కూడా దక్కకపోవడంతో రైతన్నలు నష్టాల్లో కూరుకుపోతున్నారు.

– శేఖర్‌రాజు. తొట్టికండ్రిగ, రైతు

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

నింద్ర: మండలంలోని అరూరు, ఇరుగువాయి గ్రామాల్లో నిర్వహిస్తున్న గృహ నిర్మాణ పనులను సోమవారం ఏఈ శ్రీధర్ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అన్నారు. పూర్తి చేసిన వారికి బిల్లులు సకాలంలో అందిస్తామన్నారు. పనులు పూర్తి చేసి బిల్లు పొందాలని ఆయన అన్నారు. నూతన గృహ నిర్మాణానికి కూడా అర్హులైన వారిని నమోదు చేస్తామన్నారు.

బాలికల ఉజ్వల భవిష్యత్‌కే కిశోర వికాసం

పాలసముద్రం: యుక్త వయసులో ఉన్న బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్‌కు కిశోర వికాసం కార్యక్రమం ఎంతో దోహద పడుతుందని పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. సోమవారం పాలసముద్రం ఉన్నత పాఠశాలలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ సుశీల, మురళి కిశోర వికాసంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు బీపీ, హెచ్‌ఐవీ వంటి పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులతో మాట్లాడుతూ బాలబాలికల్లో వచ్చే మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్యంపై దృష్టి సారించి జంక్ ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్ మానేసి ఇంట్లో తయారు చేసే పౌష్టికాహారం, ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఎం, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

కుల ఆడిట్‌లోని మార్పులకు చివరి అవకాశం

పుత్తూరు: కులగణన సర్వే లిస్టులో వచ్చిన తప్పులను పరిశీలించి తగిన మార్పులు చేయాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ తిరుపతి జిల్లా కార్యదర్శి మునివేలు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే లిస్ట్‌లో వచ్చిన తప్పులను సవరించుకోవడానికి ఈనెల 7వ తేదీ మంగళవారం చివరి రోజని, ఈ అవకాశాన్ని ఎస్సీ మాదిగలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. షెడ్యూల్డ్ కులాల కుల గణనలో ఎస్సీ మాదిగలకు బదులుగా ఎస్సీ ఆదిఆంధ్ర, ఆది ద్రావిడ, ఆది క్రిస్టియన్లుగా నమోదు కాబడి ఉందని వివరించారు. ప్రస్తుతం సచివాలయాల్లో ఉంచిన వివరాల్లో నగరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, చంద్రగిరి నియోజవర్గాల్లో 70 శాతం మంది మాదిగలను ఎస్సీ ఆది ఆంధ్రా ఉపకులంగా చూపినట్లు తెలిపారు. అలా కాకుండా ఎస్సీ మాదిగలుగా కుల గణాంకాల్లో రావాలని వారు కోరారు. లేని పక్షంలో విద్యా, ఉద్యోగ రంగాల్లో తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మామిడిలో సస్యరక్షణ చేపట్టాలి

వడమాలపేట (విజయపురం): మామిడిలో పూత నుంచి కాపు వరకు సస్యరక్షణలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చునని మండల ఉద్యాన అధికారి వెంకట సౌజన్య అన్నారు. సోమవారం తిరుమణ్యం సచివాలయంలో మామిడిలో వచ్చే చీడపీడలు, తెగుళ్లు, వాటి నివారణ పద్ధతులు, పంట దిగుబడికి పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడి తోటల్లో పూత రావడానికి పొటాషియం నైట్రేట్ లేదా 13.0.45 ఒక లీటరు నీటిలో 10 గ్రా, సూక్ష్మ పోషకాలు (ఫార్ములా-4) 5గ్రా ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే మామిడి తోటల్లో తేనె మంచు పురుగు, తామర పురుగు, బూడిద తెగులు లేత కొమ్మలను ఆశించి నష్ట పరుస్తాయని తెలిపారు. దీంతో కాడలు, కొమ్మలు మాడిపోయి, ఎండిపోయి, పూత, పిందె ఏర్పడదు. ఒకవేళ ఏర్పడినా బలహీన పడతాయి. దీని నివారణ కోసం ఇమిడాక్లోప్రిడ్ లీటర్ నీటికి 0.5 మి.లి లేదా డైమిథోయేట్ 2 మి.లీ పిచ్చికారు చేయాలని తెలిపారు. అలాగే తామర పురుగు ఆశిస్తే ఫ్రిప్రానిల్ 2 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటిలో కలిని పిచికారీ చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి

పట్టాలిచ్చారు... భూములు చూపండి

విజయపురం: మహారాజపురం రెవెన్యూ లెక్కదాఖలలో తమకు కేటాయించిన భూములను చూపించాలని స్థానిక ఆదిఆంధ్రవాడ ప్రజలు సోమవారం తహశీల్దార్ కిరణ్‌ను కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహారాజపురం రెవెన్యూకు సంబంధించిన సర్వే నెంబర్ 177, 178లో 45 మందికి ఒక్కొక్కరికి 1.50 ఎకరా చొప్పున పదిహేనేళ్ల క్రితం డీకేటీ పట్టాలు ఇచ్చారు. అయితే ఆ భూములు ఎక్కడ ఉందో ఇంత వరకు చూపలేదన్నారు. ఎన్ని సార్లు వినతిపత్రం ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. ఆర్‌డీఓ, కలెక్టర్ ఇలా ఎంత మందిని కలిసినా తమకు న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

తక్షణమే గ్రావెల్‌కు అనుమతి

మహారాజపురం రెవెన్యూ పరిధిలో గ్రావెల్ తవ్వకానికి అనుమతి ఇవ్వడంపై స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా, అక్రమ క్వారీ తవ్వకానికి యుద్ధప్రాతిపదికన అనుమతులు ఇవ్వడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సర్వే నెంబర్ 1/పి లో గ్రావెల్ తవ్వకానికి అనుమతి ఇవ్వడంపై ప్రజలు అనుమానం వ్యక్త పరుస్తున్నారు. అసలు ఆ సర్వే నెంబర్ ఎక్కడ ఉందో చూపాలని, అక్రమ గ్రావెల్ తవ్వకాన్ని వెంటనే రద్దు చేసి, తమ భూములను చూపాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న మహారాజపురం ఆదిఆంధ్రవాడ ప్రజలు

అరుణగిరిపై ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎస్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి పాలు, పెరుగు, కుంకుమ, విబూధితో పాటు నారికేళ జలాలతో అభిషేకాలు చేపట్టారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. అదేవిధంగా చవటగుంటలోని ఆవుదేవర నందీశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, పూజలు చేపట్టారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి

రెవెన్యూ సమస్యలపై శ్రద్ధ పెట్టండి



మాట్లాడుతున్న అరుణకుమారి

పాలసముద్రం : మండల పరిధిలో రైతుల నుంచి వచ్చిన రెవెన్యూ సమస్యలపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తహసీల్దార్ అరుణకుమారి తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి రెవెన్యూ సమస్యలతో వచ్చిన రైతుల వద్ద నుంచి అర్జీలు తీసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం రైతుల నుంచి భూసమస్యలపై ఐదు అర్జీలు వచ్చాయన్నారు. వీఆర్‌ఓలు గ్రామాల్లో ప్రభుత్వ భూములను ఆక్రమించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రిషివర్మ, ఆర్ఐ దేవి, సర్వేయర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాస్ మునిరత్నం జయంతి

పుత్తూరు: రాష్ట్రీయ సేవా సమితి(రాస్) పూర్వ అధ్యక్షుడు గుత్తా మునిరత్నం జయంతి వేడుకలను సోమవారం స్థానిక రాస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు, పేదలకు అల్పాహారం అందించారు. అనంతరం రాస్ కార్యాలయంలో ఎన్టీఆర్ ట్రస్ట్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పలు విద్యా సంస్థల విద్యార్థులు, ఆటో యూనియన్ సభ్యులు, రాస్ సంస్థ సభ్యులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో రాస్ అధికారులు రవి, శేఖర్, తేజ, కమల తదితరులు పాల్గొన్నారు.

రామేశ్వరం ఆలయంలో మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి: తమిళనాడు రామేశ్వరంలోని శ్రీరామనాథ స్వామి ఆలయంలో నిర్వహించే మార్గళి తింగళ్(మార్గళి సోమవారం) పూజల్లో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. ఆలయ అధికారులు ఆమెకు స్వామి దర్శనం కల్పించి, ప్రసాదాలు అందజేశారు. ఆలయంలో మార్గళి తింగళ్ పూజలు ప్రత్యేకం కావడంతో ఆ పూజల్లో పాల్గొన్నట్లు ఆమె తెలిపారు.

రామేశ్వరం ఆలయంలో మాజీ మంత్రి ఆర్కేరోజా



నిజంగా నారాయణుడే..




బోరు, స్థలానికి సంబంధించి డాక్యుమెంట్‌ను అందజేస్తున్న రైతు నారాయణరెడ్డి

745 అడుగుల మేర బోరు వేసినా చుక్క నీరు పడలేదు.. గ్రామానికి నీరు సరఫరా అయ్యే బోరు పూడి పోవడంతో గ్రామంలో తాగునీటికి మహిళలు పడుతున్న బాధను చూసి ఓ రైతు బోరును వితరణ చేసి పుణ్యం కట్టుకున్నాడు. వివరాలు.. మండలంలోని నల్లవెంగనపల్లె పంచాయతీ బాలకృష్ణాపురంలో తాగునీటి సమస్య ఏర్పడగా స్థానిక సర్పంచ్ పుష్ప గతంలో రెండుబోర్లు డ్రిల్ చేయించారు. కానీ నీరు పడలేదు. ఉన్న బోరు కూడా పూడి పోవడంతో గ్రామంలో తాగునీటి కొరత ఏర్పడింది. దీంతో రైతు నారాయణరెడ్డి తన పొలంలో ఉన్న మూడు బోర్లలో ఒక బోరు ఉన్న స్థలాన్ని స్వచ్ఛందంగా పంచాయతీ అధికారులకు రాత పూర్వకంగా వితరణ చేశారు. సర్వే నంబర్ 30–5లో ఉన్న బోరుకు సంబంధించి స్థలంతో పాటు బోరును కూడా తన అనంతరం పిల్లలకు సైతం ఆ స్థలానికి ఎటువంటి హక్కు, సంబంధం లేదని రాసిన డాక్యుమెంట్‌ను సోమవారం పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మికి అందజేశారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు చొరవ చూపిన రైతుకు సర్పంచ్ పుష్ప, వైఎస్సార్‌సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ, సచివాలయ సిబ్బందితో పాటు బాలకృష్ణాపురం గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

– వెదురుకుప్పం

ఆర్టీఐ క్యాలెండర్ ఆవిష్కరణ

గంగాధర నెల్లూరు: సమాచార హక్కు చట్టం అవగాహన సంస్థ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం సంస్థ ప్రతినిధులు బండి పట్టాభిరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీడీవో హరి ప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ

మంచు దుప్పటి

గంగాధరనెల్లూరు: మండలంలో సోమవారం ఉదయం 10 గంటల వరకు కూడా పొగ మంచు కప్పేసింది. తీవ్రమైన చలితో పాటు దట్టమైన పొగ మంచు దుప్పటిలా పరుచుకుంది. ప్రయాణికులు వాహనాలకు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. కూలి పనులకు వెళ్లే శ్రామికులు ఈ చలి తీవ్రత వల్ల ఇబ్బందులు పడ్డారు. శ్వాసకోశ ఇబ్బందులు ఉండే ప్రజలు ఈ చలికి బయట తిరగకుండా, దూరంగా ఉండడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.



